కామెడీకథ

# బాలరాజు ఏడ్చాడు!

బాలరాజు వృత్తి విద్యా కేంద్రం వారిచ్చిన శిక్షణా కార్యక్రమం ముగించుకుని ఉత్సాహంగా తన ఊరికి వచ్చాడు.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు తీసుకువచ్చే ఏదైనా వ్యాపారం పెడదామనే ఆలోచనలో వున్నాడు. అలా ఆలోచించి, ఆలోచించి, నగరంలో వడియాలు, అప్పడాల వ్యాపారం ప్రారంభించాడు. అందుకోసం రెండు గదులున్న పోర్షన్ అద్దెకు తీసుకున్నాడు.

తను లేనప్పుడు ఫోను రిసీవ్ చేసుకోవడానికీ, దానితోపాటూ తనకు సహాయంగా వుండడానికీ, ఇలా అన్ని విధాలా పనికొస్తాడని తన మేనల్లుడు అప్పలకొండను ఊరినించి తీసుకొచ్చాడు.

అప్పలకొండకు కొంచెం అమాయకత్వం వుంది. పల్లెటూళ్ళో పెరగడం వలన, ఎప్పుడూ పట్నపువాసనలు సోకకపోవడం వలన అలా తయారయ్యాడని అతడి అమ్మానాన్నలు బాలరాజు వెంట పంపారు.

జీతం, బత్తెం లేకుండా తనకు ఊరికే పనిచేసి పెట్టే వాళ్ళుంటే చాలని అప్పలకొండను ఆనందంగా తన వెంట తీసుకొచ్చాడు.

ఒక శుభముహూర్తంలో బోర్డు తగిలించేడు. అప్పడాలు, వడియాలు తయారుచేసే వారి దగ్గర అవి కొని వాటిని లాభానికి హోటళ్ళకు అమ్మడం అతని వ్యాపారం.

అలా తన మొదటిరోజు ఆఫీసులో కూర్చుని ఒక ముఖ్యమైన కాగితం అప్పలకొండకిచ్చి ''రెండు కాఫీలు పట్రా'' అన్నాడు.

అప్పలకొండ ఆ కాగితం తీసుకొని గబగబ నడిచేడు. నడుస్తూ ఆలోచనలో పడ్డాడు.

'బాలరాజు కాగితం ఇచ్చి కాఫీలు పట్టుకు రమ్మంటాడేమిటి? కాఫీ తేవడానికి ఫ్లాస్కు ఇవ్వాలి గానీ కాగితం దేనికి?'

అతని ఆలోచనలు తెగడం లేదు.

రెండడుగులు వేసేసరికి బుర్రలో వెలిగింది. 'కాఫీ గ్లాసు మీద ఈ కాగితం కప్పడానికి, అలా కప్పితే కాఫీ వేడి వేడిగా వుంటుంది కదా! అదీ సంగతి' అనుకున్నాడు.

కేంటిన్‌కు వెళ్ళి రెండు కాఫీ అని అరిచేడు. వారు క్షణాల్లో రెండు గ్లాసుల్లో కాఫీ ఇచ్చారు. బాలరాజు ఇచ్చిన కాగితాన్ని రెండు ముక్కలు చేసి గ్లాసుల మీద వుంచి వేగంగా నడుస్తూ బాలరాజు దగ్గరకొచ్చి, రెండు గ్లాసులు టేబులు మీద వుంచాడు.

తలొంచుకుని రాసుకుంటున్న బాలరాజు వీపుపై కొట్టి-

''నువ్ ఒక్కడివే కదా, నేను కాఫీ తాగనని తెలుసుకదా, రెండు కాఫీలు తెమ్మన్నావ్, నీ తెలివి తెల్లారినట్టే వుంది'' అన్నాడు.

బాలరాజుకు క్షణం సేపు అర్థం కాలేదు. అప్పలకొండ చేసిన ఘనకార్యం అర్థమయ్యేసరికి, కాఫీ గ్లాసులమీద తడిసిన ముఖ్యమైన కాగితం. ఆ కాగితం అతికించి ఎండపెట్టాలా లేక ముందే ఫేను క్రింద వుంచి ఇస్త్రీ చెయ్యాలా? అనే మీమాంసలో వుండగానే అప్పలకొండ అక్కణ్ణించి తప్పుకున్నాడు తన వలన ఏదో పొరపాటు జరిగిందని.

అప్పలకొండ చేసిన పనికి క్షణకాలం బాలరాజు బాధపడినా, వెంటనే స్థిమితపడ్డాడు. జీతం లేకుండా ఫ్రీగా పనిచేసే అసిస్టెంటు కదా, తప్పదు ఇలాంటి బుల్లి, బుల్లి కష్టాలు అనుకుని సమాధానపడ్డాడు.

★ ★ ★

తరువాతరోజు తన కంపెనీ అమ్మే అప్పడాలు, వడియాల కొటేషను ఇవ్వడానికి నగరంలోని ఒక నక్షత్రాల హోటలుకు వచ్చాడు అప్పలకొండతో సహా.

తమ పని పూర్తయిన తరువాత ఆ హోటల్‌లోనే టిఫిన్ చేద్దామని అప్పలకొండతో రెస్టారెంటులోకి వచ్చి కూర్చున్నాడు.

తెల్లబట్టలు వేసుకున్న వ్యక్తి వచ్చి ''సార్ ఏం కావాలి'' అన్నాడు. అప్పలకొండ ఆ వ్యక్తి వంక అసూయగా చూసి ''నాకు అలాంటి ఉద్యోగం చూడరాదూ, చక్కగా తెల్లబట్టలేసుకుని తిరగొచ్చు'' అన్నాడు.

బాలరాజు ఆ మాటలకు తలపట్టుకుని సమాధానం చెప్పకుండా ఊరుకున్నాడు.

వచ్చిన బేరర్ ఇరవై పేర్ల లిస్టు చదివాక చివరగా వినిపించిన ''పన్నీర్ దోస'' ఆర్డర్ చేసాడు బాలరాజు.

''తింటున్నప్పుడు చల్లుతారా వంటిమీద పన్నీరు'' అన్నాడు అప్పలకొండ అమాయకంగా.

''కాదు తినేసిన తర్వాత'' అన్నాడు బాలరాజు వెటకారంగా. అప్పలకొండ ఆ వెటకారంలోని భావాన్ని అర్థం చేసుకోలేదు.

పన్నీర్ దోసెలు, వాటితో పాటు ఫోర్కు, స్పూను వచ్చాయి. వాటిని చూసి అప్పలకొండ కంగారుపడ్డాడు. ''ఇవి దేనికి?'' అన్నాడు.

బాలరాజు అతడి చెవిలో ''ఆత్మరక్షణకి, ఈ హోటల్‌లో దొంగల బెడద వుంది, టిఫిన్లు తింటున్నప్పుడు దొంగలేమీ చెయ్యకుండా వుండడానికి ఈ ఫోర్కులు అరగంటసేపు అద్దెకిస్తారు ఈ హోటలు వారు'' అన్నాడు.

ఆ మాటలు అప్పలకొండ నమ్మేట్లు లేకపోవడంతో, ''చూడు నా మాటలు అబద్ధమైతే అందరి టేబుళ్ళ మీద ఆ ఫోర్కులెందుకు?'' అన్నాడు.

అప్పలకొండ నలువైపులా చూసి, ''బావుందే ఈ ఏర్పాటు?'' అనుకుంటూ భయం భయంగా తింటూ ఒక చేతిలో ఫోర్కుతో చుట్టూ చూస్తున్నాడు.

బాలరాజుకు నవ్వాగడం లేదు. నవ్వితే బాధపడతాడని మౌనంగా టిఫిన్ తినడం ముగించాడు.

బేరర్ వేడినీళ్ళు, నిమ్మకాయ తీసుకొచ్చి టేబిల్ మీద వుంచాడు.


అప్పలకొండ దోసె తినడం పూర్తిచేసి ప్లేటులో చేతులు కడగబోయేడు.

''నిమ్మకాయను ఆ వేడినీళ్ళలో పిండి చేతులు కడుక్కో'' అన్నాడు బాలరాజు.

''ఊరుకో నీ తెలివి తెల్లారినట్టే వుంది, నేనేదో పల్లెటూరి వాణ్ణని ఆటాడిస్తున్నావ్, వేడినీళ్ళు నిమ్మకాయ ఇస్తే, అవి కలిపి తాగుతారు గానీ చేతులు కడుక్కుంటారా?'' అంటూ అప్పలకొండ కోప్పడుతూ గబగబా నిమ్మకాయ పిండి వేడినీళ్ళు తాగాడు.

బాలరాజు ఇక చేసేది లేక తనుమాత్రం నిమ్మకాయ పిండిన నీళ్ళల్లో చేతులు కడుక్కున్నాడు.

అప్పలకొండ అతడి వంక చూస్తూ ''ఖర్మ... చదవేస్తే వున్నమతి పోయిందని ఇంత మతిలేనివాడివేంటి? నిమ్మకాయ నీళ్ళు తాగితే



ఆరోగ్యానికి మంచి॰, దాంతో చేతులు కడుక్కుంటావా? ఇంత బుర్రలేనివాడివి వ్యాపారం ఎలా చేస్తావ్?'' అన్నాడు.

అప్పలకొండ మాటలకు బాలరాజుకు దుఃఖం వచ్చింది. ఏడుపును బలవంతంగా ఆపుకుంటూ బిల్లు కాగితం మీద వంద నోటుంచి తలొంచుకొని కూర్చున్నాడు.

''పన్నీరు చల్లలేదేం..? బొత్తిగా మోసగాళ్లలా వున్నారు హోటలువాళ్ళు'' అంటూ సణుక్కుంటున్నాడు అప్పలకొండ.

గిన్నెలో వక్కపొడి, పటికబెల్లం ముక్కలు పట్టుకొచ్చి బేరర్ వెళ్ళిపోయాడు.

బాలరాజు కాసిన పలుకులు నోట్లో వేసుకుని ముందుకు కదిలాడు.

''మొత్తం మనకోసం తెచ్చాడు. అలా ఒదిలేసి పోతావేం... ఈ చిల్లర కూడా'' అంటూ ఆ గిన్నెలోని వక్కపొడి, పటికబెల్లం, బేరర్‌కోసం వుంచిన టిప్‌తో సహా మొత్తం తన జేబులోకి వంపుకున్నాడు. బాలరాజు, అతడి ప్రయత్నాన్ని ఆపుదామని విరమించుకున్నాడు, మళ్ళీ ఏ అవాకులు చెవాకులు పేలతాడో అనుకుంటూ ఊరుకున్నాడు.

గేటు దగ్గర సూటేసుకున్న వ్యక్తి ''సార్ ఫుడ్ ఎలా వుంది?'' అని ప్రశ్నించాడు అప్పలకొండను.

''నీ బొందలా వుంది, పన్నీర్ దోస ఆర్డరిస్తే పన్నీరు చల్లకుండా పంపుతారా... ఎంత మోసం?'' అన్నాడు సీరియస్‌గా.

ఆ కోటు వ్యక్తి కొద్ది క్షణాలు ఆలోచనలో పడి..''గుడ్ జోక్..బావుంది సార్ మీ సెన్సాఫ్ హ్యూమర్, కీపిటప్'' అన్నాడు పగలబడి నవ్వుతూ.

''అరె నీకు సీరియస్‌గా చెపుతుంటే జోక్‌లా వుందా? పన్నీర్ దోస తింటున్నప్పుడో, తినేసిన తర్వాతో పన్నీరు చల్లొచ్చుకదా'' అంటూ అప్పల కొండ గొడవకు దిగాడు.

బాలరాజు వెనక్కొచ్చి అప్పలకొండను బలవంతంగా లాక్కెళ్ళాడు. అలా లెక్కెళుతున్న బాలరాజుకు తొడమీద ఏదో గుచ్చుకొన్నట్టయింది. గబ గబా పేంటు జేబులో చెయ్యి పెట్టి లోపలున్న వస్తువును బైటకు తీసాడు బాలరాజు. అది హోటల్ వారి ఫోర్కు అతణ్ణి వెక్కిరిస్తూ.

బాలరాజు అప్పలకొండ వంక కోపంగా చూసి ''ఏమిట్రా ఇది?'' అన్నాడు.

ఆ మాటలకు అప్పలకొండ ఫకాలుమని నవ్వి, తన జేబులోంచి ఇంకో ఫోర్కు తీసి- ''దొంగనాయాళ్ళు, పన్నీరు చల్లకుండా ఎగ్గొట్టారు కదా, అందుకని నా జేబులో ఒకటి వేసుకొని నీకు తెలీకుండా ఒకటి తోసా! రేప్పొద్దున్న హోటల్‌కు వెళ్ళినప్పుడు ఆత్మరక్షణకు ఫోర్కులు అద్దెకు తీసుకు రానక్కరలేదు'' అన్నాడు.

అతడి మాటలకు ఏం సమాధానం చెప్పాలో తెలీక 'నాకు భలే దెబ్బకొట్టావురా, నా మాటలు నాకే అప్పచెప్పావ్. మొత్తానికి బూమరాంగ్ అయింది. నాకీ శాస్తి జరగాల్సిందే'' అనుకుంటూ లోలోపలే ఏడ్చాడు బాలరాజు. ఆ ఏడుపును బైటకు రానీయకుండా ''భలే రిపార్టీ ఇచ్చావురా'' అన్నాడు.

అతడి మాటలకు నవ్వుతూ ''నీకు మతి పూర్తిగా పోయింది. హోటలుకు తీసుకొచ్చి పార్టీ ఇచ్చింది నువ్వు. పైగా నేనిచ్చానంటావా!'' అన్నాడు అప్పలకొండ.

అప్పలకొండ మాటలకు లోపల అణుచుకున్న దుఃఖం వెల్లువలా పైకొచ్చేసింది బాలరాజుకు. ఇక ఆపుకోలేక గట్టిగా ఏడ్చేసాడు. ✪

డాక్టర్ ఎమ్. సుగుణరావు